సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 10.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 198
పేజీలు: 08 వెల: రూ. 5

## కరీంనగర్ బంద్ సక్సెస్

**బీఆర్ఎస్ బంద్‌కు భారీ స్పందన**

- గంగుల అరెస్ట్ తో ఉద్రిక్తత.. భారీ పోలీసు బందోబస్తు
- రోడ్లెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
- క్యాంప్ కార్యాలయంపై దాడి తర్వాత రాజకీయ వేడి
- ప్రతిపక్ష గొంతు నొక్కేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపణలు
- బండి సంజయ్-బీఆర్ఎస్ మాటల యుద్ధం తారాస్థాయికి
- తెలంగాణ రాజకీయాల్లో కరీంనగర్ హాట్‌టాపిక్

04



## తుమ్మిడిహట్టిపై కాంగ్రెస్ డ్రామా

**ఒకరేమో బ్యారేజ్‌కు అనుమతి ఉందంటారు మరొకరేమో లేదంటారు..**



- మహారాష్ట్రకు కిషన్ రెడ్డి లేఖ రాయాలంటారు రేవంత్ కు రాజకీయాలే ముఖ్యం..
- రాష్ట్ర ప్రయోజనాలు మాత్రం శూన్యం
- ప్రభుత్వ తీరుపై హరీష్ రావు గరం గరం

03

## పవన్ పరామర్శకు ప్రధాని

**పవన్ కళ్యాణ్ ఇంటికి ప్రధాని మోదీ**

- పవన్ ఆరోగ్యంపై ఆరా తీయనున్న మోదీ
- మాదాపూర్ నివాసంలో కీలక భేటీ
- పవన్‌ను చూడడానికి వస్తున్న ప్రధాని
- మోదీ-పవన్ భేటీపై రాజకీయాల్లో చర్చ

04



## సింగరేణికి మరో 9 కొత్త గనులు

**రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో ముమ్మర ప్రయత్నాలు**

- ఈ ఏడాది 3, వచ్చే ఏడాది మరో 2 కొత్త గనుల ప్రారంభానికి చర్యలు
- రాష్ట్ర ఇంధన అవసరాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొనసాగింపునకు నిర్ణయం

03






## తెలంగాణపై
# మోదీ మార్క్

### పరేడ్ గ్రౌండ్స్ వేదికగా బీజేపీ ఎన్నికల శంఖారావం!

తెలంగాణలో బీజేపీ అధికార లక్ష్యానికి భారీ రోడ్‌మ్యాప్

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయ యవనికపై మరోసారి ఎన్నికల వేడి రగులుతోంది. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్న పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా మారుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత, అలాగే ఇటీవల అస్సాం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన చారిత్రాత్మక విజయాల నేపథ్యంలో మోదీ తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రధాని మోదీ పర్యటన కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనుంది. దాదాపు రూ. 9,400 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ఈ పర్యటనలో మోదీ ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేయనున్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) నుంచి వర్చువల్‌గా జరగనున్నాయి.
హైదరాబాద్–పనాజీ ఎకనామిక్ కారిడార్, జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాను 4 లేన్లుగా విస్తరించే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కాజీపేట–విజయవాడ మిగతా 02లో

- బీజేపీ కేంద్ర సర్కారు నయా స్కెచ్..
- రూ.9,400 కోట్ల ప్రాజెక్టులతో తెలంగాణపై కేంద్రం ఫోకస్
- హైదరాబాద్ సభతో కేడర్‌లో జోష్ నింపనున్న ప్రధాని మోదీ
- 'డబుల్ ఇంజిన్ సర్కార్' నినాదంతో కమలం దూకుడు
- అభివృద్ధి + రాజకీయ వ్యూహంతో తెలంగాణలో బీజేపీ మాస్టర్ ప్లాన్
- మోదీ టూర్‌తో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెర
- పరేడ్ గ్రౌండ్స్ సభతో శక్తి ప్రదర్శనకు సిద్ధమైన బీజేపీ
- తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కమలనాథుల వ్యూహాత్మక అడుగులు
- రైల్వేలు, కారిడార్లు, టెక్స్‌టైల్ పార్క్‌లతో కేంద్రం భారీ కానుకలు
- మోదీ పర్యటనతో తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో కదలికలు

## ఉత్కంఠకు తెర

**సీఎం గా నేడు విజయ్ ప్రమాణం**

- టీవీకేకు వీసీకే మద్దతు
- ఐయూఎంఎల్ మనసు మార్చుకొని సపోర్టు
- టీవీకే సంఖ్యాబలం 120కి చేరిక
- ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం
- గవర్నర్ వద్దకు పయనం..
- ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ
- తమిళనాట పండగ వాతావరణం
- దళపతి టూ సీఎం

**ముద్ర డెస్క్ :**
తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడినట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు (TVK) ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా కీలకమైన మద్దతు లభించింది. వీసీకే (VCK), ఐయూఎంఎల్ (IUML) పార్టీలు మద్దతు ప్రకటించడంతో విజయ్ నేతృత్వంలోని టీవీకే సంఖ్యాబలం మెజారిటీ మార్క్‌ను దాటింది. దీంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది.
మే 4న వెలువడిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే అతి పెద్ద పార్టీగా నిలిచినా.. పూర్తి మెజారిటీకి మాత్రం కొద్ది దూరంలో ఆగిపోయింది. విజయ్ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించడంతో పార్టీ బలం 107కు చేరింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మిగతా 02లో






## రిజిస్ట్రేషన్ల రద్దీ..
## ప్రభుత్వం అలర్ట్

**15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనపు వేళలు**

- ఈ నెల 12 నుంచి పొడిగించిన పని వేళలు
- స్లాట్ బుకింగ్‌లు పెంచాలని ఆదేశం
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు

04

## త్రివిధ దళపతిగా
## రాజా సుబ్రమణి

**చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం**



- నావికాదళ అధిపతిగా కృష్ణస్వామినాథన్
- నేవీ, సైనిక వ్యవస్థలో భారీ మార్పులు
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం


03

## ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్
# లక్ష్యం

- 'క్యూర్' మోడల్‌తో నగరాభివృద్ధి
- ఈవీ వాహనాలకు ప్రోత్సాహం
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్

02





## తిరుమల భక్తులకు
# శుభవార్త

**డార్మిటరీల విస్తరణ**

03

## ప్రజాదర్బార్ దరఖాస్తులకు
## 3 నెలల్లో మోక్షం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**


- క్లస్టర్ల వారీగా ఫిర్యాదుల సేకరణ.. అక్కడికక్కడే పరిష్కారానికి కృషి
- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

03

## బెంగాల్ సీఎంగా
# సువేందు ప్రమాణం

**బ్రిగేడ్ గ్రౌండ్‌లో ఘన వేడుక**


- హాజరైన మోదీ, అమిత్ షా, చంద్రబాబు
- బెంగాల్ ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేసిన ప్రధాని మోదీ!
- మమతా పాలనకు ముగింపు..
- బెంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వం
- 207 సీట్ల భారీ మెజారిటీతో బీజేపీ అధికారం
- బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం





**ముద్ర డెస్క్ :**
పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం (మే 9) రోజున ప్రమాణ స్వీకారం చేశారు. సువేందు అధికారి చేత బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రమాణ స్వీకారం చేయించారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలు ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు.. తదితర రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. మిగతా 02లో

**ఇదీ AI ముద్ర**



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 10.05.2026
www.mudranews.in | @mudranews



## పీచు పదార్థం పెంచండి



శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. దీని కోసం పొట్టు తీయని గోధుమ పిండితో చేసిన రోటీలు తీసుకోవడం ఉత్తమ మార్గం.



# తెలంగాణపై మోదీ మార్క్

(మొదటి పేజీ తరువాయి)

మధ్య నూతనంగా నిర్మించిన మల్టీ–ట్రాకింగ్ రైల్వే లైన్లను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. ఇక వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పిఎం మిత్రా టెక్స్‌టైల్ పార్క్, హైదరాబాద్‌లోని నూతన పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) టెర్మినల్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. అభివృద్ధి కార్యక్రమాల అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభపై బీజేపీ శ్రేణులు భారీ ఆశలు పెట్టుకున్నాయి. దాదాపు రెండు లక్షల మంది జన సమీకరణ చేయడమే లక్ష్యంగా పార్టీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా 'గోడలపై రాత' ప్రచారం, బైక్ ర్యాలీలతో ఇప్పటికే కేడర్‌లో ఉత్సాహం నింపారు.

కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు నేతృత్వంలో ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రమిస్తోంది. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి వేల కోట్ల నిధులు కేటాయిస్తోందని, ఈ నిధులు ప్రజలకు నేరుగా చేరాలన్నా, తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధించాలన్నా 'డబుల్ ఇంజిన్ సర్కార్' (కేంద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీ పాలన) అవసరమని బండి సంజయ్ వంటి నాయకులు బలంగా వినిపిస్తున్నారు. తెలంగాణను బీజేపీకి దక్షిణాదిలో అత్యంత కీలకమైన రాష్ట్రంగా మోదీ, అమిత్ షా బృందం భావిస్తోంది. గత ఎన్నికల ఫలితాలు ఇక్కడ బీజేపీ బలాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలో, మోదీ ప్రసంగం రాష్ట్రంలోని అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, కేంద్రం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించే విధంగా ఉండబోతోందనే వార్తలు వినిపిస్తున్నాయి.

### ప్రధాని పర్యటన షెడ్యూల్ ఇదే

ప్రధాని మోదీ నేడు మధ్యాహ్నం 2.50 గంటలకు కర్ణాటక నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్ట్ చేరుకుంటారు. హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.30 గంటలకు హెచ్ఐసీసీకి చేరుకొని అక్కడ రూ. 7,389 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4.10 నిమిషాలకు హైటెక్ సిటీ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన సింధూ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకని బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో గుజరాత్‌లో జామ్‌నగర్‌కు బయల్దేరారు.

### భద్రత కట్టుదిట్టం

ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2 వేల మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు (ఎస్పీజీ), స్నైపర్లు, ముఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ బృందాలు (క్యూఆర్టీ) రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని నగర సీపీ వెల్లడించారు. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నట్లు వివరించారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. కాగా ప్రధాని పర్యటన దృష్ట్యా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాని మోదీ రాకతో తెలంగాణ బీజేపీ విభాగంలో కొత్త జోష్ వస్తుందని, ఇది రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పునాదిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద మే 10వ తేదీన హైదరాబాద్ పర్యటన అటు అభివృద్ధి పరంగా, ఇటు రాజకీయ పరంగా తెలంగాణలో ఒక కొత్త అధ్యయనానికి తెరలేపనుంది. ఈ పర్యటన తర్వాత రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఏ విధంగా మారతాయో వేచి చూడాలి.



# ఉత్కంఠకు తెర

(మొదటి పేజీ తరువాయి)

కావాల్సిన మెజారిటీ మార్క్ 118 కావడంతో రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు ప్రకటించగా.. సీపీఐ, సీపీఐ(ఎం) కలిపి నాలుగు స్థానాలతో మద్దతు ఇవ్వడానికి ముందుకొచ్చాయి.

గత కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన వీసీకే పార్టీ కూడా చివరకు అధికారికంగా మద్దతు ప్రకటించింది. ఈ మేరకు వీసీకే అధినేత తిరుమావళవన్.. టీవీకే నేత ఆదవ అర్జునకు మద్దతు లేఖ అందజేశారు. దళిత హక్కుల కోసం పోరాడే పార్టీగా పేరున్న వీసీకే మద్దతు ఇవ్వడం రాజకీయంగా కీలక పరిణామంగా మారింది. మరోవైపు నిన్న వరకు సందిగ్ధంలో ఉన్న ఐయూఎంఎల్ కూడా చివరకు అన్‌కండీషనల్ సపోర్ట్ ప్రకటించింది. ఇద్దరు ఎమ్మెల్యేలున్న ఆ పార్టీ మద్దతుతో టీవీకే కూటమి బలం 120 దాటింది. దీంతో ప్రభుత్వం ఏర్పాటు విషయంలో నెలకొన్న అనిశ్చితి పూర్తిగా తొలగిపోయింది.

ఈ పరిణామాలతో టీవీకే శ్రేణుల్లో ఆనందోత్సాహాలువెల్లివిరిశాయి. పార్టీ కార్యాలయాల వద్ద కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారు. విజయ్ అభిమానులు భారీ ఎత్తున మిఠాయిలు పంచుతూ, టపాసు లు కాలుస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి విజయ్ ముఖంలో పూర్తి ఆత్మవిశ్వాసం కనిపించిందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్ మరోసారి గవర్నర్‌ను కలిసేందుకు లోక్ భవన్‌కు వెళ్లారు. తమకు మద్దతు ఇస్తున్న పార్టీల జాబితా, ఎమ్మెల్యేల సంఖ్యకు సంబంధించిన వివరాలను గవర్నర్‌కు సమర్పించనున్నారు. త్వరలోనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అధికారికంగా ఆహ్వానం అందే అవకాశం ఉందని టీవీకే వర్గాలు చెబుతున్నాయి. తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపిన విజయ్ సీఎం పదవికి మరింత చేరువయ్యారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

అయితే బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. దీంతో సువేందుకు అధికారి బెంగాల్‌లో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా నిలిచారు. 1971 తర్వాత కోల్‌కత్తాయేతర జిల్లా నుంచి బెంగాల్ సీఎం పదవి చేపట్టిన మొదటి వ్యక్తిగా కూడా సువేందు అధికారి ఘనత సొంతం చేసుకున్నారు. అలాగే, సువేందు అధికారి.. బెంగాల్‌కు 9వ సీఎంగా నిలిచారు.

ఈ వేడుకకు భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు హాజరయ్యారు. ముందుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓపెన్ టాప్ వాహనంలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ వేదిక వద్ద చేరుకున్నారు. మోదీ వెంట సువేందు అధికారి కూడా ఉన్నారు. వేదిక వద్దకు చేరుకున్న అనంతం ప్రధాని మోదీ, సువేందు అధికారి... అక్కడ ఏర్పాటు చేసిన రవీంద్ర నాథ్ ఠాగూర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పశ్చిమ బెంగాల్‌లోని బీజేపీ అత్యంత సీనియర్ కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్‌ను ప్రధాని మోదీ సన్మానించి, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

ఇక, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. బెంగాల్‌లో మొత్తం 294 స్థానాలకు గానూ 207 స్థానాలను గెలుచుకోవడం ద్వారా మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మెజారిటీని దక్కించుకున్న బీజేపీ... తృణమూల్ కాంగ్రెస్ యొక్క 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికింది. ఈ క్రమంలోనే బెంగాల్‌లో తొలిసారి ప్రభుత్వ ఏర్పాటు చేయనున్న బీజేపీ... తమ పార్టీ శాసనసభ పక్ష నేతగా సువేందు అధికారిని ఎన్నుకుంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ప్రకటన చేశారు.

## బెంగాల్ ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేసిన మోదీ!

పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. దశాబ్దాల నిరీక్షణ తర్వాత రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా భారతీయ జనతా పార్టీ (భాజపా) ప్రభుత్వం కొలువుదీరింది. పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ చారిత్రాత్మక వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైకి రాగానే, అక్కడకు తరలివచ్చిన లక్షలాది మంది ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ అరుదైన రీతిలో స్పందించారు. ప్రజల మద్దతుకు కృతజ్ఞతగా ఆయన వేదికపైనే సాష్టాంగ నమస్కారం చేశారు. ప్రధాని చేసిన ఈ పనికి సభాప్రాంగణం మొత్తం 'మోదీ.. మోదీ' అనే జయజయధ్వానాలతో మార్మోగిపోయింది. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీని గద్దె దించి, బెంగాల్‌లో బీజేపీ పగ్గాలు చేపట్టడం భారత రాజకీయాల్లో కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. సువేందు అధికారి నాయకత్వంలో బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఈ సందర్భంగా పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ వేడుకలో పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మరియు బీజేపీ అగ్రనేతలు పాల్గొన్నారు. బెంగాల్‌లో కమలం వికసించడంతో పార్టీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నాయి.

# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డులోని కోర్ అర్బన్ రీజియన్ (సీయూఆర్ఈ) ప్రాంతంలో సమస్యలను సమగ్రంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సీఎంగా ఉంటుంది. నగరీకరణతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను సమావేశంలో సవివరంగా వివరించారు.

హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా మార్చేందుకు ప్రాంతాలు అండర్‌పాస్‌లు, గృహనిర్మాణం, ఎలివేటెడ్ కీలక కారిడార్‌ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం తెలిపారు. ట్రాఫిక్ కేవలం రోడ్ల విస్తరణ సరిపోదని, బహుళ రవాణా విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. నగరంలో పెరుగుతున్న పార్కింగ్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని మల్టీ లెవెల్ పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని.

రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు చేసి ప్రభుత్వం సీఎంను ప్రకటించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్ఈ)గా గుర్తించి సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఓఆర్ఆర్ బయట నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్ఈ)గా గుర్తించి తయారీ రంగ అభివృద్ధిపై దృష్టి పెట్టామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (ఆర్ఏఆర్ఈ)గా అభివృద్ధి చేస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడం.

తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ ప్రకారం రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ దేశీయ ఆర్థిక వ్యవస్థగా రూపొందించిన లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. కాలుష్యంలో భాగంగా మూసీ రివర్ కంట్రోల్ ఫ్రంట్ అభివృద్ధి, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, ఆర్టీసీలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోర్ అర్బన్ పరిధిలో ఆటోలను ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఈవీలుగా మార్చే సమయంలో కూడా చేపడుతున్నామని.

సమావేశంలో హైదరాబాద్ సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ రుజ్జీవ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు దేశంలోనే విప్లవాత్మకమైనదిగా స్టాండింగ్ కమిటీ సభ్యులు అభివర్ణించారు. హైదరాబాద్ నగర జీవనాన్ని మెరుగుపరిచే ఈ ప్రాజెక్టును చేపట్టినందుకు ముఖ్యమంత్రిని కమిటీ అభినందించింది. రాష్ట్రంలో మహిళా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ప్రశంసించింది.



# గల్ఫ్ దేశాలకు మోదీ ఝలక్

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియా సంఘర్షణలు అంతర్జాతీయ చమురు సరఫరాను దెబ్బతీస్తుండగా, భారత్ ఇథనాల్ బ్లెండింగ్ వ్యూహంతో లక్షల కోట్ల ఆదా సాధించింది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం ద్వారా విదేశీ చమురు ఆధారాన్ని తగ్గించారు. ఆర్థిక భద్రతను బలోపేతం చేస్తూ 25 శాతం కలిపే అంశంపై కసరత్తు చేస్తోంది. దీంతో గల్ఫ్ దేశాల చమురు దిగుతులు తగ్గే అవకాశం ఉంది.

### అంతర్జాతీయ సంక్షోభాల నేపథ్యం

పశ్చిమాసియాలో ఉద్రిక్తులు ముడి చమురు ధరలు పెరిగాయి. సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీశాయి. భారత్ వంటి దిగుమతి ఆధార దేశాలకు ఇది హెచ్చరిక సంకేతంగా మారింది. పరాయి ఇంధనాలపై అత్యధిక ఆధారం ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తుందని గుర్తించిన కేంద్రం పునరుత్పాదక ఇంధనాల వైపు మలుపు తిప్పింది.

### ఇథనాల్ బ్లెండింగ్..

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలవడంతో దేశానికి సంవత్సరానికి 4.5 కోట్ల బ్యారెల్ల చమురు ఆదా అవుతుంది. రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్య నష్టం తగ్గింది. ఈ విజయంతో ప్రభుత్వం 25 శాతం లక్ష్యంగా పెట్టుకుంది, వాహన ఇంజిన్ సామర్థ్యం, పర్యావరణ ప్రభావాలను పరీక్షించి ముందుకు సాగుతోంది. ఈ వ్యూహం దేశీయ ఆధారాలను బలపరచడమే కాక, రైతుల ఆదాయాన్ని కూడా పెంచుతోంది.

### రిఫైనరీల విస్తరణపై దృష్టి..

దేశీయ శుద్ధీకరణ సామర్థ్యాన్ని పెంచేందుకు రాజస్థాన్ బార్మర్, అస్సాం నుమాలిగఢ్ రిఫైనరీలు వేగంగా పూర్తవుతున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్‌లో కొత్త మెగా ప్లాంట్లు రానున్నాయి, పశ్చిమ తీరంపై దృష్టి సారించారు. 100 శాతం సామర్థ్యం లేని యాజమాన్య యూనిట్ల బదులు కొత్త మౌలిక సదుపాయాలు దీర్ఘకాల భద్రత ఇస్తాయి.

### పునరుత్పాదక ఇంధనం..

స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వులను బలోపేతం చేస్తూ, గ్రీన్ హైడ్రోజన్, సౌర–పవన శక్తి వంటి శుభ్ర ఇంధనాలపై పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఇవి పర్యావరణ రక్షణకు సహాయపడుతూ, జాతీయ భద్రతను మరింత రక్షిస్తాయి. అత్యవసర కాలంలో స్వల్పకాలిక అంతరాయాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతోంది. పశ్చిమాసియా ఘర్షణలు శిలాజ ఇంధన ఆధారాల ప్రమాదాన్ని బహిర్గతం చేశాయి. ప్రపంచ దేశాలను స్వావలంబన వైపు మళ్లించాయి. భారత్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని గ్రీన్ ఎనర్జీ విస్తరణ, ఇథనాల్ పెంపు, చమురు నిల్వల పెరుగుదల ద్వారా ఆర్థిక వ్యవస్థను కుదుపులకు తట్టుకునేలా తయారుచేస్తోంది.



## ప్రధాని మోదీ పర్యటనలో పాల్గొనాలని సీఎం రేవంత్‌కు కేంద్రం ఆహ్వానం

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణలో ప్రధాని మోదీ ఆదివారం పర్యటించనున్న సంగతి తెలిసిందే. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని సీఎం రేవంత్‌ను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు సీఎంకు జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ ఆహ్వానపత్రికను అందజేశారు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

ఆదివారం 10.05.2026

www.mudranews.in | @mudranews




### తెల్ల బియ్యానికి దూరంగా ఉండండి

పాలిష్ చేసిన బియ్యంలో పీచు పదార్థం ఉండదు కాబట్టి అది శరీరంలో కొవ్వు పెరగడానికి కారణమవుతుంది. తెల్ల బియ్యానికి



ప్రత్యామ్నా యంగా పీచు ఎక్కువగా ఉండే బ్రౌన్ రైస్‌ను

## త్రివిధ దళపతిగా రాజా సుబ్రమణి

**చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం**

**నావికాదళ అధిపతిగా కృష్ణస్వామినాథన్**

**నేవీ, సైనిక వ్యవస్థలో భారీ మార్పులు**

**గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం**



**ముద్ర, కరీంనగర్ :** దేశ సైనిక వ్యవస్థలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. కీలక నియామకాల ప్రక్రియను కేంద్రం భర్తీ చేసింది. దేశానికి తదుపరి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఎన్ ఎస్ రాజా సుబ్రమణ నియమితులయ్యారు. అదే సమయంలో వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదుపరి నావికాదళ అధిపతిగా బాధ్యతలు స్వీకరించన న్నారు. ఈ మేరకు కొద్దిసేపటి కిందటే దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

## స్వీయ జనగణనకు నేడే ఆఖరు

**కేంద్ర వెబ్ సైట్ తో ఇంటి నుంచే ఫోన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోండి**

**హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల**



**ముద్ర, హైదరాబాద్ :** కేంద్రం నిర్వహిస్తోన్న స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ కచ్చితంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రకటనలో సూచించారు. 2027 జనగణనలో భాగంగా ఆన్ లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. https://se.census.gov.in అనే వెబ్సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభం గా స్వీయ గణన నమోదు చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని తెలిపారు. నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని సూచించారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్లైన్ నమోదు తర్వాత ఎన్యుమరేషన్ ఐడి వస్తుందన్నారు.ఆ నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## తిరుమల భక్తులకు శుభవార్త

**డార్మిటరీల విస్తరణ**

**భక్తులకు వసతి సౌకర్యం మెరుగు**

**గదులు దొరకని భక్తులకు టీటీడీ సదుపాయం**



**ముద్ర, డెస్క్ :** తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వసతి సమస్యలకు చెక్ పెట్టేందుకు టీటీడీ కీలక చర్యలు చేపట్టింది. భక్తులకు మరింత సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు ఐదు యాత్రికుల వసతి సముదాయాలను ఏర్పాటు చేసి, మొత్తం 10 వేల డార్మిటరీ బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గదులు దొరకని భక్తులు ఇకపై ఇబ్బందులు పడకుండా ఈ సదుపాయాలను వినియోగించుకోవచ్చు.ఈ డార్మిటరీల్లో ఉచిత లాకర్లు, వాష్‌రూమ్‌లు, క్షౌరశాలలు వంటి సౌకర్యాలు కల్పించారు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకుంటే భక్తులు ఈ సేవలను సులభంగా పొందవచ్చు. పీఏసీ-1 సీఆర్వో సమీపంలోని గోవర్ధన్ సత్రం ఎదురుగా ఉన్న సముదాయంలో నాలుగు హాళ్లు, 1,256 లాకర్లు ఏర్పాటు చేసినట్లు టీటీడీ పాలక మండలి వెల్లడించింది. ఈ కొత్త ఏర్పాట్లతో భక్తులు ఇక చింత లేకుండా శ్రీవారిని దర్శించుకునే అవకాశం లభించనుంది.

## సింగరేణి సిగలో మరో 9 కొత్త గనులు

**రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో ముమ్మర ప్రయత్నాలు**


**ఈ ఏడాది 3, వచ్చే ఏడాది మరో 2 కొత్త గనుల ప్రారంభానికి చర్యలు**

**రాష్ట్ర ఇంధన అవసరాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొనసాగింపునకు నిర్ణయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని సింగరేణి సంస్థ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. బొగ్గు నిల్వలు తగ్గి మూతపడుతున్న గనుల స్థానంలో కొత్త ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. మొత్తం 9 కొత్త గనుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖలకు పంపించింది.ఈ ఏడాది మూడు కొత్త గనులు, వచ్చే ఏడాది మరో రెండు గనులను ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో అనుమతుల ప్రక్రియ వేగవంతమైంది. ఇప్పటికే ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమవగా, కొత్తగూడెంలోని వీకే కోల్ మైన్ కూడా ఉత్పత్తికి సిద్ధమైంది.2027-28 నాటికి నాలుగు గనులు మూతపడనున్న నేపథ్యంలో కొత్త ప్రాజెక్టులతో ఆ లోటును భర్తీ చేయాలని సింగరేణి భావిస్తోంది. ఈ కొత్త గనుల ద్వారా మరో 20 సంవత్సరాలకు పైగా బొగ్గు ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇల్లందు, రామగుండం, బెల్లంపల్లి, మణుగూరు, మందమర్రి ప్రాంతాల్లో కొత్త ఓపెన్ కాస్ట్, ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఈ గనుల ద్వారా వందల మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికితీయనున్నారు. కొత్త ప్రాజెక్టులతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర విద్యుత్ అవసరాలకు కూడా దీర్ఘకాలిక భరోసా లభించనుంది. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, శ్రీ గౌతమ్ పోట్రు, తిరుమల రావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, అడ్వైజరు (ఫారెస్ట్రీ) మోహన్ పరిగెన్, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం సీపీపీ ఎ.మనోహర్, కొత్తగూడెం నుంచి జీఎం

# బీసీలకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం

- కేంద్ర జనగణనలో బీసీ కాలం పొందుపర్చాల్సిందే
- దేశవ్యాప్తంగా బీసీ జనాభా లెక్క తేల్చి న్యాయం చేయాలి
- ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు
- హైదరాబాద్ లోని తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న జనగణన జాబితాలో బీసీల కాలం మెన్షన్ చేయాలని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్రం, దేశంలో బీసీ జనాబా పెరుగుతోందన్న ఆయన.. జనగణన ద్వారా తమకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలనూ పరిగణలోకి తీసుకోవాలన్నారు. జనగణనలో భాగంగా బీసీ కులగణననూ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వీహెచ్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. హైదరాబాద్ అంబర్‌పేటలోని తన నివాసంలో ఉదయం పదిన్నర గంటల నుంచి ఆయన దీక్ష మొదలెట్టారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. జనగణనలో బీసీల అంశంపై ఇప్పటికే ప్రధాని మోడీకి రెండు లేఖలు రాశామని చెప్పారు. వాటికి జవాబు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలపై నిర్ణయం తీసుకున్న తర్వాతే మోడీ తెలంగాణకు రావాలన్నారు. బీసీలకు న్యాయం జరిగితే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ఆ మేరకు మోడీ నిర్ణయం తీసుకునేలా తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. దేశాన్ని ముక్కలు చేయాలనే ఉద్దేశంతో బీజేపీ, మతపరంగా ముందుకు వెళ్తోందని ఆరోపించిన వీహెచ్.... మహిళా రిజర్వేషన్లలోనూ బీసీలకు కోట ఇవ్వలేదని మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్లో కొట్లాడారన్నారు.. తరచూ తాను బీసీని అని చెప్పుకునే మోడీ తన ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతనే తెలంగాణలో అడుగుపెట్టాలని వీహెచ్ సవాల్ చశహారు. లేకపోతే దేశం మొత్తం తిరిగి మోడీని, బీజేపీని ఎండగడతా అని హెచ్చరించారు

## ప్రజాదర్బార్ దరఖాస్తులకు మూడు నెలల్లో మోక్షం

- క్లస్టర్ల వారీగా ఫిర్యాదుల సేకరణ
- అక్కడికక్కడే పరిష్కారం
- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



**ముద్ర, ఖమ్మం:** ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితి లోపు పరిష్కరించేలా కార్యా చరణ సిద్ధం చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పులతోనే రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే.. మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితా లో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్న మంత్రి, ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 14,700 దరఖాస్తులు వచ్చాయని, అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనన్నారు. తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ సమస్యలకు పరిష్కారం చూపండి

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ చీఫ్ కవిత బహిరంగ లేఖ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** పాలమూరు-రంగారెడ్డి కి జాతీయ హోదా, జనగణనలో బీసీ గణన, మహిళా రిజర్వేషన్ లవలబిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా, తెలంగాణ బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని టీఆర్ఎస్ చీఫ్ కవిత ప్రధానమంత్రి మోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రధాని తెలంగాణ పర్యటన నేపథ్యంలో శనివారం ఆమె మోడీకి నాలుగు అంశాలతో కూడిన బహిరంగ లేఖ చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ వంటి కరువు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు జీవనాడి లాంటిదని.. 12.31 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. 90 శాతం కేంద్రం నిధులతో వెంటనే ప్రాజెక్ట్ ను పూర్తి చేయాలని కోరారు. దేశంలో బీసీల జనాభాపై కచ్చితమైన గణాంకాలు లేవనీ ఫలితంగా ఆయా వర్గాలకు అందాల్సిన అభివృద్ధి పథకాలు అందరికీ చేరడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2027 జనాభా లెక్కల్లో బీసీల కోసం ప్రత్యేక కాలమ్‌ను చేర్చాలన్నారు వారి కులాల పేర్లు స్పష్టంగా పేర్కొనేలా జనాభా గణన ఉండాలని ఆకాంక్షించారు. చట్టసభల్లో మహిళలకు కేటాయించే 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించాలని కోరారు. అప్పుడు మాత్రమే వెనుకబడిన వర్గాల మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు లభిస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. బిల్లులో కచ్చితంగా ఈ సవరణ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లు చేసిందన్న కవిత.. దీనికి రాష్ట్రపతి ఆమోదం పొందేలా కేంద్రం సహకరించాలని కోరారు. ఈ నాలుగు డిమాండ్లను పేర్కొంటూ ప్రధాని మోడీకి కవిత లేఖ రాశారు. తెలంగాణకు మేలు చేసే ఈ అంశాలపై రాష్ట్ర బీజేపీ ఎంపీ లు దృష్టి సారించాలన్నారు. ఈ అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి ఆయనను ఒప్పించాలని కోరారు.

## తుమ్మిడిహట్టిపై కాంగ్రెస్ డ్రామా


- మాజీ మంత్రి హరీష్ రావు
- రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని వాడు కుంటోంది
- మహారాష్ట్రతో సత్సం బంధాలు ఉంటే ఎందుకు ఒప్పందం కుదుర్చుకోలేదు



**ముద్ర, సిద్దిపేట :** కాంగ్రెస్ ప్రభుత్వానికి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని ఉపయోగించుకుంటోందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న కాంగ్రెస్.. మహారాష్ట్రతో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్తున్నా.. ఇప్పటి వరకూ ఎందుకు ఒప్పందం కుదుర్చుకోలేకపోయిందని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీష్ రావు మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద రూ.11 వేల కోట్ల పనులు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఈ ప్రాజెక్టుపై ఒప్పందం కుదిరిందని మంత్రులు చెబుతుండగా.. సీఎం మాత్రం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒప్పందం కుదిరేలా చూడాలని లేఖ రాశారని చెప్పడం ప్రభుత్వ వైఖరిలోని గందరగోళాన్ని బయటపెడుతోందన్నారు. 150 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ఒప్పందం కుదరలేదని పేర్కొన్నారు. గతంలో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా రూ.2300 కోట్ల బిల్లులు ఎత్తేశారని, మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద మంత్రులు హడావిడి చేయడం తప్ప అసలు పనిలో పురోగతి కనిపించడం లేదన్నారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి హయాంలోనే 150 మీటర్లకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడడం పచ్చి అబద్ధమన్నారు. తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీళ్లు తెస్తామని మంత్రి జూపల్లి, 9:30 నుంచి సుందిళ్లకు నీళ్లు తెస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి, 9:30 నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తెస్తామని సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో ఎవరికి తోచిన విధంగా వారు మతి లేని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

## కారు - స్కూల్ బస్సు ఢీ

ప్రభుత్వ వైద్యుడు మృతి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ విజయ్ కుమార్ (43) మృతి చెందారు. రాయచూర్ - కోదాడ జాతీయ రహదారిపై సీబీఎం కళాశాల సమీపంలో కారు మరియు ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.తీవ్రంగా గాయపడిన డాక్టర్ విజయ్ కుమార్‌ను స్థానికులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వందేమాతరం ఫౌండేషన్ వద్ద వ్యాయామం ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. మక్తల్‌కు చెందిన విజయ్కుమార్ మూడేళ్లుగా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నారు. ఆయనకు భార్య యశ్వంత్ రాణి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య కూడా వైద్యురాలే. డాక్టర్ విజయ్ కుమార్ మృతిపై అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. వైద్యులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు నివాళులర్పించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 10.05.2026
www.mudranews.in | @mudranews



### తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (GI) ఆహారం

రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరగకుండా ఉండటానికి తక్కువ GI ఉన్న రోటీ వంటి ఆహారాలను తీసుకోవాలి. ఇది ఇన్సులిన్ స్థాయిలను నియంత్రించి గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది.



# మోడీజీ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడండి!



దేశ ప్రధాని నరేంద్ర మోడీ 2024 లోకసభ ఎన్నికల అనంతరం తొలిసారిగా హైదరాబాదుకు నేడు వస్తున్నారు. ఆ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి వివిధ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు ప్రధాని కి స్వాగతిస్తున్నాం. ఇదే సందర్భంలో నూతనంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నప్పటికీ..శ్రీ మోడీ గారు దేశ ప్రధానిగా 2014 నుండి కొనసాగుతున్నారు. రాష్ట్రాల పునర్విభజన చట్టంలో పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు పరచాలని కోరుతున్నాం.

ముఖ్యంగా కృష్ణా గోదావరి నది జలాల పంపిణీ.. ఆ నదులపై చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సహకారం అందించాల్సిన అవసరం ఉన్నది. తెలంగాణలో ఏదైనా ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నారు. ఆంధ్రకు పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులను ఇస్తున్నారు. అదేవిధంగా తెలంగాణకు వరప్రదాయమైన పాలమూరు–రంగారెడ్డి, ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టులలో ఒక దానికి జాతీయ హోదా కల్పించాలని గత పది సంవత్సరాలుగా పదే పదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పెడచెవినా పెడుతున్నారు. నది జలాల పంపిణీకి పర్యవేక్షణకు ఏర్పడిన బోర్డు కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నది. కృష్ణా జలాలను కేటాయించిన దాని కంటే ఏ పి అక్రమంగా ఎక్కువగా తీసుకుంటున్నప్పటికీ పర్యవేక్షణ చేయటం లేదు. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణలో చేపట్టిన నీటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వటంలో తీవ్ర కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తున్నారు.

హైదరాబాద్ కు వస్తున్న సందర్భంలో హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ కు అనుమతులు ఇవ్వాలి, రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నప్పటికీ ఇవ్వకుండా.. బిజెపి పాలిత రాష్ట్రాలకు మెట్రో ఇస్తూ హైదరాబాద్ కి ఇవ్వకుండా పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు. మూసి పునర్నిర్మాణానికి, పర్యావరణ అభివృద్ధికి నిధులు అనుమతులు ఇవ్వకుండా సవత్తితల్లి ప్రేమ అవలంబిస్తున్నారు. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో గతంలో అనేక కేంద్ర పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు ఉండేవి.. ఒక్కొక్కటిగా మూత బడుతూ లేదా ప్రైవేటీ కరణ చేస్తూ పోతున్నారు. నూతన పరిశ్రమలకు మౌలిక సదుపాయాలను.. యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయడం లేదు. ముఖ్యంగా అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ సెమి కండక్టర్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వ నిష్పక్షపాతానికి నిదర్శనం.

కేంద్రానికి తెలంగాణ రాష్ట్రం నుండి జిఎస్టి రూపంలో, సెంట్రల్ టాక్స్, సేల్స్, ఆదాయం పన్నులు, పెట్రోల్ డీజిల్ ద్వారా అమ్మకం ద్వారా, వాణిజ్య పన్నులు వేల కోట్లు ప్రతి సంవత్సరము అందుతున్నాయి. కేంద్రం నుండి అదనంగా ఇచ్చేది ఏమీ లేకున్నా..కనీసం తెలం గాణ నుంచి వస్తున్న ఆదాయంలో కనీసం 50 శాతం కూడా ఇవ్వకుండా పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు.

ఇక పోతే జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ లో ఆధునీకరణ చేస్తున్నామని చెప్తున్నారు. దక్షిణ భారత దేశానికి హైదరాబాద్ నడిబొడ్డుగా ఉంటూ రైల్వే,రోడ్డు ట్రాన్స్పోర్ట్ రంగానికి కీలకంగా ఉంటున్న కేంద్రం..అభివృద్ధిలో భాగంగా ఏవిధంగానైనా ఆధునీకరించాల్సిన అవసరం ఉన్నది. భారతదేశ ఫెడరల్ విధానాన్ని పాటిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నాను.



- ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646
తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం సభ్యులు

## క్రికెట్ ఆడుతుండగా హైదరాబాద్ విద్యార్థి మృతి


ముద్ర, హైదరాబాద్ : బిహార్‌లోని పట్నా ఐఐటీ క్యాంపస్‌లో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి మృతి చెందాడు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతూ ప్రమాదవశాత్తు స్తంభాన్ని తాకడంతో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు విడిచాడు. మృతుడిని చందానగర్‌కు చెందిన హర్షిత్‌రాజ్‌గా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. పట్నా ఐఐటీలో అతడు ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడని తెలిపారు. శనివారం ఉదయం 6గంటల సమయంలో ఈ విషాద ఘటన చోటు చేసుకున్నట్లు ఐఐటీ పట్నా సెక్యూరిటీ ఇన్‌ఛార్జి దీపక్ కుమార్ చౌరాసియా పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతుండగా విద్యార్థి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడన్నారు. వెంటనే హర్షిత్ రాజ్‌ను చికిత్స కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వైద్య కళాశాలకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారని అధికారులు మీడియాకు తెలిపారు.

# రిజిస్ట్రేషన్ల రద్దీ.. ప్రభుత్వం అలర్ట్

**15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనపు వేళలు**
**ఈ నెల 12 నుంచి పొడిగించిన పని వేళలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** భూముల రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా పెరిగిందన్నారు.

రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అధిక రద్దీ ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్.ఓ., పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలను ఈ నెల 12వ తేదీ నుంచి పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పదిహేను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవసరమైతే మరింత సమయాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.




ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను కూడా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, వేగం, ప్రజలకు సౌకర్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పనిచేస్తోందని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు ను మంత్రి ఆదేశించారు.

# కరీంనగర్ బంద్ సక్సెస్

**బీఆర్ఎస్ బంద్‌కు భారీ స్పందన**
**గంగుల అరెస్ట్ తో ఉద్రిక్తత..**
**భారీ పోలీసు బందోబస్తు..**
**రోడ్లెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు**

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ లో శనివారం బంద్ కొనసాగుతోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై భాజపా దాడికి నిరసనగా కరీంనగర్ బంద్‌కు భారత రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. అయితే బీఆర్ఎస్ బంద్‌కు కరీంనగర్ ప్రజలకు సంబంధమేంటని బీజేపీ ప్రశ్నించింది. బంద్‌ను అడ్డుకుంటామని హెచ్చరించింది. భాజపా, బీఆర్ఎస్ దాడులు వారి వ్యక్తిగత వ్యవహారమని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. పరస్పర భిన్న ప్రకటనల నేపథ్యంలో కరీంనగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీగా మోహరించి ఎక్కడికక్కడ రాజకీయ పార్టీల కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను గృహనిర్బంధం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులను ఉదయమే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంగుల ఇంటి వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించగా.. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు.

ఇప్పటికే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి ఘటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఈ ఘటనపై ఆగ్రహంతో బీఆర్ఎస్ బంద్‌కు పిలుపునివ్వగా.. పరిస్థితులు అదుపు తప్పే అవకాశం ఉందని భావించిన పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కీలక నేతలను అదుపులోకి తీసుకున్నారు.

గంగుల కమలాకర్ అరెస్ట్‌పై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.. కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా.. ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను మాత్రమే ఇళ్లకే పరిమితం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష గొంతును అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

మరోవైపు పోలీసులు మాత్రం శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే అరెస్టులు చేస్తున్నామని స్పష్టం చేస్తున్నారు.






ఇప్పటికే గత రెండు రోజులుగా కరీంనగర్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. ఇరు పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది.

పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన బండి సంజయ్ అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. అదే సమయంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనాన్ని కూడా ధ్వంసం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బంద్ పిలుపు నేపథ్యంలో కరీంనగర్ పట్టణం మొత్తం పోలీసు వలయంలోకి వెళ్లిపోయింది. ప్రధాన కూడళ్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా.. ఎక్కడికక్కడ పోలీసులు పహారా కాస్తున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో ప్రజల్లో కూడా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం కరీంనగర్ రాజకీయ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## పవన్ ఇంటికి వెళ్లి మోదీ పరామర్శ

**పవన్ ఆరోగ్యంపై ఆరా తీయనున్న మోదీ**
**మాదాపూర్ నివాసంలో కీలక భేటీ**
**పవన్‌ను చూడడానికి వస్తున్న ప్రధాని**
**మోదీ-పవన్ భేటీపై రాజకీయాల్లో చర్చ**



**ముద్ర, హైదరాబాద్ :** భారత ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లనున్నట్టు వార్తలు రావడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హైదరాబాద్ మాదాపూర్‌లోని పవన్ నివాసంలో సాయంత్రం ఈ భేటీ జరగనుండగా.. మెగాస్టార్ చిరంజీవి కూడా అక్కడికి చేరుకోనున్నట్టు సమాచారం. ఇటీవల నాజల్ సర్జరీ చేయించుకున్న పవన్ కళ్యాణ్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ కారణంగా ఆయన ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సుకు కూడా హాజరుకాలేకపోయారు. ఇదిలా ఉండగా ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనలో భాగంగా పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభకు హాజరుకానున్నారు. అయితే సభకు ముందే పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఆయన ఇంటికి వెళ్లనున్నారనే వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మోదీ–పవన్ మధ్య ఉన్న ఆప్యాయత గురించి అభిమానులు ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. గతంలో పార్లమెంట్‌లో "ఇతను పవన్ కాదు.. తుఫాన్" అంటూ మోదీ చేసిన వ్యాఖ్యలను అభిమానులు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారు. చంద్రబాబు–మోదీ మధ్య జరిగిన సరదా సంభాషణ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ ఆరోగ్యం బాగుంటే ఆయనే కూడా ఈ వేడుకలో పాల్గొనేవారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి ప్రమాణం..

**అభినందనలు తెలిపిన చంద్రబాబు**



**ముద్ర అమరావతి:** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం (మే 9) ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయనతో ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు వివిధ కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు స్వయంగా వెళ్లి సీఎం సువేందు అధికారికి శుభాకాంక్షలు తెలియజేశారు. సువేందు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

భారీ సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు ఈ ప్రమాణ స్వీకార వేడుకకు తరలివచ్చారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం కాషాయ జెండాలు, నినాదాలతో సందడిగా మారింది. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా ఉంది.

## సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి




**ముద్ర న్యూస్ బ్యూరో మెహిదీపట్నం:** హిందువుల ఐక్యతను చాటి చెబుతూ మెహిదీపట్నం సమీపంలోని నేతాజీ నగర్ లో శనివారం రాత్రి హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గోల్కొండ భాగ్ కార్యకారిణి మలిపెద్ది శంకర్, జగద్గిరి గుట్టలోని కేదార్నాథ్ క్షేత్రం స్వామీజీ శివరుద్ర సాధువు, మహిళా వక్త వాణి సక్కుబాయి ఈ సమ్మేళనంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఛత్రపతి శివాజీ మొదలుకొని హెగ్డేవార్ దాకా ఎందరో నేతల స్ఫూర్తితో హిందూ జాతి ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ సమ్మేళనంలో హైందవ జాతి ఐక్యతను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వక్తలు చాటి చెప్పారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు. నేతాజీ నగర్, ఓం నగర్, శ్రీనివాస్ నగర్, జ్యోతి నగర్, మారుతి నగర్ హిందూ సమ్మేళన సమితి శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనంలో వందలాదిమంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి నేతాజీ నగర్ కు చెందిన డాక్టర్ జనార్ధన్, టీ ఎస్ ఆనంద్ రెడ్డి, కేవీబీ మురళీ మోహన్ రావు,రంగప్రసాద్, కే పద్మావతి ఆధ్వర్యంలో పుష్పావతి, పరిమళ శ్రీనివాస్, శ్రీనివాస నగర్ చెందిన జానకీ రామ్, మారుతి నగర్ కు చెందిన సతీష్ చంద్, ఓంనగర్ కు చెందిన శ్రీనివాస్ రెడ్డి ఏర్పాట్లు చేశారు.



### ఖనిజాల ఆవశ్యకత

గుండె లయను.. రక్తపోటును నియంత్రించడానికి మెగ్నీషియం, పొటాషియం అవసరం. బియ్యం కంటే గోధుమల లో ఇవి అధికంగా ఉండి రక్త ప్రసరణను మెరుగు పరుస్తాయి.



## ఎమ్మెల్యే ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేందుకే కేసు నమోదు

**- మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ,**



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్ నియోజకవర్గ ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నేతలు తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటనలో తాండూర్ నియోజకవర్గ అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తూ, గత పాలకులు చేసిన అవినీతిని ఎండగడుతూ ప్రజల్లో ఆదరభిమా నాలు పెంపొందించుకుంటున్న ఎమ్మెల్యే ఎదుగుదలను చూసి కేసు నమోదు చేయించడం దుర్మార్గమని ఆమె పేర్కొన్నారు. అపార్టీ పట్టణ కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన ఓటమిని జీర్ణించుకోలేక, ఎమ్మెల్యే పైన అనవసర రాద్ధాంతం చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేయించారని, వారికి త్వరలోనే తగిన రీతిలో బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.

## కేసు పెట్టించడం దుర్మార్గం..

**- సర్పంచ్ పురుషోత్తం రెడ్డి**



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై కేసులు నమోదు చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని వీరారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి ఆరోపించారు. ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తూ, గత రెండు న్నర సంవత్సరాలుగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడి ప్రతిష్టను దెబ్బతీయడానికే బీఆర్ఎస్ నాయకులు కుట్ర పన్నారని విమర్శించారు. మచ్చలేని నాయకుడిపై బురద జల్లేందుకే పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు పెట్టించారని ఆయన పేర్కొన్నారు. గత మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజయం సాధించిన కౌన్సిలర్లను అభినందించేందుకు కౌంటింగ్ కేంద్రంలోని విలేకరుల ప్రాంతానికి వెళ్లిన సందర్భాన్ని సాకుగా తీసుకుని కేసులు నమోదు చేశారని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ సేవలు అందిస్తున్న ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని పురుషోత్తం రెడ్డి అన్నారు.

## గోవిందక్షేత్రంలో శ్రవణ నక్షత్ర కళ్యాణం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గోవింద క్షేత్రంలో ప్రతినెల నిర్వహించే మాస కళ్యాణోత్సవాల్లో భాగంగా శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి బాలరాజు, కమిటీ సభ్యులు లక్ష్మీ నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం


**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** హిందువులు సంఘటితంగా ఐక్యమత్యంతో కలిసి మెలిసి ఉండాలని ఉద్దేశంతోనే హిందూ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని శ్రీ శివానందపురి మాతాజీ, శ్రీ యోగాంబిక ఈపోపిరం పీఠాధిపతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా శ్రీ గంగాధర్ సంబాగ్, సహకార్యదర్శి శ్రీ సరస్వతి విద్యాపీఠం భాగ్యనగర్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి మరియు హిందూ సమామని, హిందూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు సమాజంలో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొనేం దుకు హిందువులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నేతలు, పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** పెద్దేముల్ మండలం హన్మపూర్ గ్రామానికి చెందిన పాపయ్య శనివారం మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయంగా మూడు వేల రూపాయలను తాండూరు పట్టణానికి చెందిన బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హన్మాపూర్ సర్పంచ్ లొంకా రాములు, పాపయ్య కుమారుడు రాములు, యువకులు పంజుగుల రవి, బక్కని విజయ్, పసుల వెంకట్, దస్తప్ప, తదితరులు ఉన్నారు.

## అనుమానాస్పదంగా భార్యాభర్తల మృతి



**ముద్ర డెస్క్:** భార్యాభర్తలు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన జడ్చర్ల పట్టణంలో జరిగింది. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులోని విజయ నగర్ కాలనీలో ఆకుతోట శేఖర్ (56), ఆకుతోట వరాలు (49) తమ ఇంట్లో పడుకున్న చోటే మృతిచెంది పడి ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. శేఖర్ పట్టణంలో బియ్యం వ్యాపారంతో పాటు చీటీల ఏజెంట్‌గా వ్యవహరించేవాడు. ఆయన భార్య వరాలు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. రెండు రోజులుగా శేఖర్‌కు కూడా జ్వరం ఉండడంతో ఇంట్లోనే ఉన్నాడు. ఉదయం వరకు ఇంటి తలుపులు తెరవక పోవడంతో అనుమానం వచ్చిన కుమారుడు కిటికీ లోంచి చూడగా, ఇద్దరూ చలనం లేకుండా పడి ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సైలు మల్లేష్, జయప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.

భార్యాభర్తలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఆత్మహత్య చేసుకునేంత సమస్యలు వీరికి లేవని, ఆర్థిక పరిస్థితి కూడా బాగానే ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా..? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

# ప్రధాని మోడీ సభకు భారీ భద్రత

**- 2 వేల మంది పోలీసులతో బందోబస్తు**

**- సీపీ సుమతి**

**ముద్ర, మల్కాజిగిరి:** భారత ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఆదివారం పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు మల్కాజిగిరి సీపీ సుమతి తెలిపారు. ఈ సభకు లక్ష మందికి పైగా ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రెండు వేల మంది పోలీసులతో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మల్కాజిగిరి డీసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన




సీపీ సుమతి, సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, రాకపోక మార్గాలు, వాహన పార్కింగ్ ప్రాంతాలు అన్నీ కఠిన నిఘాలో ఉంటాయని తెలిపారు. నిర్ణీత గేట్ల ద్వారానే ప్రవేశం కల్పించనున్నట్లు, ప్రతి ఒక్కరికి భద్రతా తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. సభా ప్రాంగణం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలను సీసీటీవీ నిఘాలోకి తీసుకువచ్చి, కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్లు, స్నిఫర్ డాగ్ బృందాలు, ప్రత్యేక సాంకేతిక బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్, యాంటీ ఈవ్‌టీజింగ్ బృందాలను ప్రత్యేకంగా మోహరించనున్నట్లు పేర్కొన్నారు. సభలో ల్యాప్‌టాప్‌లు, డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులు, నీటి సీసాలు, హెల్మెట్లు, బయట ఆహార పదార్థాలు తదితర నిషేధిత వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

బేగంపేట–సికింద్రాబాద్, పారడైజ్–పాట్నీ ప్రధాన మార్గాల్లో పార్కింగ్ నిషేధం అమల్లో ఉంటుందని, ప్రజలు నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

## రాత్రిపూట పోలీస్ పహారా బలోపేతం చేయండి



**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర, మల్కాజి గిరి:** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని శాంతి భద్రతల అంశాలపై, ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఉప్పల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలు, కాలనీల్లో భద్రతా ఏర్పాట్లు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు, రాత్రి పహారా బలోపేతం వంటి అంశాలను ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ, ప్రజల భద్రత తమ ప్రాధాన్యమని, ఉప్పల్ ప్రాంతంలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండారి నీలం రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి

**- నివాళులర్పించిన ఆర్బీఓఎల్ సీఈఓ బియ్యాని శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, తాండూరు ప్రతినిధి:** మాతృభూమి విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అన్యాయంపై అలుపెరగని పోరాటం చేసిన వీర యోధుడు మహారాణా ప్రతాప్ సింగ్ అని ఆర్బీఓఎల్ సీఈఓ బియ్యాని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రోడ్ మార్గంలోని ఖాంజాపూర్ గేట్ సమీపంలో ఉన్న మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఈఓ ప్రసంగిస్తూ.. మహారాణా ప్రతాప్ సింగ్ ధైర్య సాహసాలు, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కష్టకాలంలో కూడా ఆత్మగౌరవాన్ని వదులుకోకుండా పోరాడిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, యువకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీర యోధుడిని స్మరించుకున్నారు.



# మంత్రి 'తుమ్మల'ను కలిసిన బండి రమేష్

**ముద్ర కూకట్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర కమ్మ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బండి రమేష్ శనివారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఆయనకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న బండి రమేష్‌ను అభినందించిన మంత్రి, ఈ పదవి ద్వారా కమ్మ కులంలోని పేద ప్రజలకు విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సహకారంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి, వారిని ఆర్థికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. కార్పొరేషన్ బలోపేతానికి ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి సహాయ సహకారాలు



ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, అలాగే తనకు వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి బండి రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కమ్మ కుల బాంధవుల సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

**ముద్ర డెస్క్:** ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన శనివారం మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రేనివట్లలో చోటుచేసుకుంది. కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామానికి చెందిన కావలి రాములు(38) మద్దూరు మండలం అప్పిరెడ్డి పల్లి గ్రామం నుంచి రెనివట్ల గ్రామానికి వరి మోపులు కట్టే యంత్రాన్ని ట్రాక్టర్‌కు తగిలించుకొని వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో రాములు ట్రాక్టర్ పెద్ద టైరు కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి 10 సంవత్సరాల క్రితం వివాహం కాగా భార్య నవనీత, కుమారుడు(8) ఉన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో అలసత్వం.. రైతుల ఆందోళన

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లు మందగమనంలో సాగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 15 రోజుల క్రితం యార్డులో 1.10 లక్షల బస్తాలకు పైగా మొక్కజొన్న నిల్వ ఉండగా, ప్రస్తుతం అది 70 వేల బస్తాలకు తగ్గినప్పటికీ సమస్య మాత్రం కొనసాగుతోంది. రోజుకు కేవలం రెండు నుంచి మూడు లారీలు మాత్రమే తరలింపునకు రావడం, మరోవైపు రోజుకు సుమారు 10 వేల బస్తాల కొత్త దిగుబడి మార్కెట్‌కు చేరుతుండటంతో నిల్వలు తగ్గడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సమస్యలపై టీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, బీజేపీ తదితర ప్రతిపక్ష పార్టీలు మార్కెట్ యార్డును సందర్శించి ఆందోళనలు చేపట్టాయి. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వారం రోజుల్లో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఇటీవల ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎంపీ డా. మల్లు రవి, జిల్లా కలెక్టర్ కలిసి మార్కెట్ యార్డును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వారు వచ్చిన రోజే 14 లారీలను ఏర్పాటు చేసి సుమారు 60 వేల బస్తాల మొక్కజొన్నను వేగంగా తరలించినట్లు తెలిసింది. అయితే కొత్త పంట భారీగా మార్కెట్‌కు చేరుతుండటంతో నాగర్‌కర్నూల్–వనపర్తి మధ్య ఉన్న సహకార సంఘం గోదాములకు కూడా మొక్కజొన్నను తరలిస్తున్నారు. అక్కడ దాదాపు 30 వేల బస్తాలను నిల్వ చేసినట్లు సమాచారం. అధిక దిగుబడి వచ్చినా సరైన కొనుగోలు వ్యవస్థ లేక రైతులకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నీ బ్యాగులు, లారీలు, రవాణా సౌకర్యాలు కల్పించి, పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా వేగంగా కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులను రైతులు కోరుతున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 10.05.2026
www.mudranews.in | @mudranews





### ఉప్పును నియంత్రించండి

రోటీ పిండి కలిపేటప్పుడు అదనంగా ఉప్పు వేయడం మానుకోవాలి. ముఖ్యంగా హై బీపీ ఉన్నవారు 'నో సాల్ట్ రోటీ' తీసుకోవడం వల్ల గుండెకు మేలు జరుగుతుంది.

# రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు..

- ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- వేగవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది
- తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులు, స్టోరేజ్ కేంద్రాలకు తరలించాలి..
- అధికారులను ఆదేశించిన కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా..




**ముద్ర , కరీంనగర్ :**

జిల్లాలో రైతులు విక్రయానికి తీసుకొస్తున్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి సివిల్ సప్లై అధికారులతో పాటు తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ పురోగతిపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు కట్టుబడి ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ చర్యల ఫలితంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ క్రమబద్ధంగా, రైతులకు అనుకూలంగా కొనసాగుతోందన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో శనివారం రాత్రివేళ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యాన్ని టర్పాలిన్లతో కప్పివేయడం, నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టడం, అవసరమైతే అదనపు రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో ఎక్కువసేపు నిల్వ ఉంచకుండా వెంటనే సమీపంలోని మిల్లులు లేదా స్టోరేజ్ కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం ఆలస్యం కాకుండా వేగంగా తరలింపునకు అవసరమైన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా నిర్లక్ష్యం, జాప్యం లేదా రైతులకు ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కలెక్టర్, రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం రైతుల పక్షాన పూర్తిస్థాయిలో నిలబడి, వారి కష్టానికి తగిన ఫలితం అందేలా అన్ని చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే శ్రీనివాస్ రెడ్డి హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, సివిల్ సప్లై అధికారులు పలు శాఖల తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో బంద్

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హౌస్ అరెస్ట్
- రోడ్డెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
- మోహరించిన పోలీసులు

**ముద్ర, కరీంనగర్ :**

కరీంనగర్ పట్టణంలో శనివారం బంద్ కొనసాగింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ దాడికి నిరసనగా కరీంనగర్ బంద్‌కు భారత రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. అయితే, బీఆర్ఎస్ బంద్‌కు కరీంనగర్ ప్రజలకు సంబంధమేంటని భాజపా ప్రశ్నించింది. బంద్‌ను అడ్డుకుంటామని హెచ్చరించింది. భాజపా, బీఆర్ఎస్ దాడులు వారి వ్యక్తిగత వ్యవహారమని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. పరస్పర భిన్న ప్రకటనల నేపథ్యంలో కరీంనగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీగా మోహరించి ఎక్కడికక్కడ రాజకీయ పార్టీల కార్యకర్తలను అరెస్టు చేశారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను గృహనిర్బంధం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులను ఉదయమే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## వరి ధాన్యం, మక్కలు తడిసిపోవడంతో
# రైతులు తీవ్ర ఆందోళన

**పరిశీలించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి**

**ముద్ర, కోరుట్ల;**

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి శనివారం రోజు జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లతో కలిసి సందర్శించారు. మార్కెట్ యార్డు మొత్తం మక్కలతో నిండిపోవడంతో పాటు భారీగా వడ్లు కూడా కొనుగోలు కేంద్రాలకు చేరుకున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వరి ధాన్యం, మక్కలు తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మార్కెట్ యార్డులో టార్పాలిన్ల సౌకర్యం పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## సాత్నాల ప్రాజెక్టు కాలువలో
# పూడికతీత పనుల ప్రారంభం

- మేడిగూడ సి-కాలువ వద్ద పూజలు నిర్వహించిన కలెక్టర్
- మరమ్మతులకు రూ. 69 లక్షలు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడి

**ముద్ర, ఆదిలాబాద్;**

సాత్నాల మండల కేంద్రంలోని ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో మేడిగూడ సి–కాలువ వద్ద చేపట్టనున్న పూడికతీత పనులను రాజర్షి షా ప్రారంభించారు. నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. రైతులకు సాగునీటి సరఫరా మెరుగుపడేందుకు కాలువల పూడికతీత పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం సాత్నాల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్, ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 69 లక్షల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే సాగునీటి సరఫరా సామర్థ్యం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు. నీటిపారుదల సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మహేష్, ఎంఆర్ఓ రామారావు, ఎంపీడీఓ వెంకట్ రాజు, ఏపీఓ వెంకటరమణ, సర్పంచ్ అంజనా బాయి పాల్గొన్నారు. అధికారులు, కూలీలు, స్థానిక ప్రజలు కూడా హాజరయ్యారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. కాలువల పూడికతీత, మరమ్మతుల పనులతో వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

# గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

**కేజీ గంజాయి, కారు, ఒక సెల్ ఫోన్లు స్వాధీనం....**

**ముద్ర, కోరుట్ల;**



కోరుట్ల పట్టణానికి చెందిన ఎం.డి. యాసిన్, కొత్తూరు సిద్ధార్థ్ అను ఇద్దరు యువకులు గత కొంతకాలంగా మహారాష్ట్ర నాందేడ్ పట్టణానికి చెందిన షేక్ ముజాహిద్ వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి అట్టి గంజాయిని కోరుట్ల పరిసర గ్రామాల యువతకు ఎక్కువ ధరకు గంజాయిని విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డారు. అదే క్రమంలో వీరిద్దరూ శుక్రవారం రోజు కారులో నాందేడ్ పట్టణానికి వెళ్లి షేక్ ముజాహిద్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. మరుసటి రోజు కోరుట్ల వస్తున్న క్రమంలో ఎస్సై చిరంజీవి కి నమ్మదగిన సమాచారం ప్రకారం ఎస్సై సిబ్బందితో కలిసి కోరుట్ల శివారు వెటర్నరీ కాలేజీ ముందు వాహనాలు తనిఖీ చేపట్టారు. అదే సమయంలో నిందితుల కారును ఆపి విచారించగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో డాష్ బోర్డు నందు నిందితులు దాచిన 1కేజీ నిషేధిత గంజాయిని గుర్తించి స్వాధీనం పరుచుకోవడం జరిగింది. అలాగే ఒక సెల్ ఫోన్ మరియు కారును స్వాధీన పరుచుకుని నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు అనంతరం కోర్టులో హాజరుపరచడం జరిగింది. మరో నియందు ముజాహిద్ పరార్ లో ఉన్నారు. అతడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని, గంజాయిని సరఫరా చేసిన, అమ్మిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎస్సై చిరంజీవి మరియు సిబ్బంది అశోక్, సాగెర్, రాజేశ్వరరావు లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం వద్దు

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- అకాల వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- కొనుగోలు కేంద్రాల పరిశీలన

**ముద్ర, జగిత్యాల;**



జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలం పెద్ద నక్కలపేట, దోనూరు, తిమ్మాపూర్, వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని నిర్ణీత తేమ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు తెలిపారు. ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిల్లుల వద్ద త్వరగా అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో రైతులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలవకుండా అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కరీంనగర్ బంద్‌కు
# ప్రజల మద్దతు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- ప్రభుత్వ వైఫల్యంపై ప్రజల నిరసన
- శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శ
- దాడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ముద్ర, కరీంనగర్ :**

కరీంనగర్ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చి ప్రభుత్వ వైఫల్యానికి గట్టి సమాధానం ఇచ్చారని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వరుస దొంగతనాలు, దాడుల ఘటనలు నిరూపిస్తున్నాయని విమర్శించారు. తనపై, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కార్యాలయంపై జరిగిన దాడులు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడులేనని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాల పేరుతో దాడులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. బంద్‌ను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయించడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని ఆయన ఆరోపించారు. ప్రజల నిరసనలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దాడులకు బాధ్యులైన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లో ప్రజల్లో భద్రతాభావం తగ్గిపోయిందని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై తమ పార్టీ ఎప్పటికీ వెనక్కి తగ్గదన్నారు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

ఆదివారం 10.05.2026

www.mudranews.in | @mudranews



## బరువు నియంత్రణ



కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉండే రోటీ తింటే ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉండి ఆకలి తగ్గుతుంది. ఇది అధిక బరువును తగ్గించి గుండెపై పడే భారాన్ని తగ్గిస్తుంది.

## డీజీపీకి శుభాకాంక్షలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ని తెలంగాణ హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు సద్ది వెంకట్ రెడ్డి శుక్రవారం సాయంత్రం డిజిపి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హోటళ్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సప్తగిరి, వేణుగోపాల్, తాజ్ మహల్ చంద్ర శేఖర్, సుప్రభాత్ కృష్ణ మూర్తి, రామమూర్తి, గండేశ్వర్ రావు, రాధా కృష్ణ పాల్గొన్నారు.

## కళ్యాణం.. కమనీయం



**ముద్ర, తుంగతుర్తి:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి సూరమాంబ కళ్యాణ మహోత్సవం శని వారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులుసు యాదగిరి గౌడ్ మాజీ తుంగతుర్తి వైస్ ఎంపీపీ శ్రీశైలం, డీలర్ వెంకన్న, గుండ గానిరాము, వీరమల్లు, లతోపాటు పలువురు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్‌లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా కార్యక్రమానికి నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా ఇప్పటి వరకు 2600 పైచిలుకు మంది అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అందులో ఇప్పటికే 1800 మందికి స్క్రీనింగ్ నిర్వహించి టోకెన్ కేటాయింపు చేయడం జరిగిందని ఆదివారం వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే స్వయంగా నియామక పత్రాలు అందజేస్తారని చెప్పారు.

## 20న ప్రజానాట్య మండలి మహాసభలు



**ముద్ర, యాదగిరిగుట్ట :** ఆలేరులో ఈనెల 20న జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా 3వ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి యాదగిరిగుట్ట మండల మహాసభ శనివారం మల్లిగూడెం గ్రామంలో మీసాల దాసు అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాటలు రచించి ప్రజాపాటలుగా ప్రజలను చైతన్యం చేయడం కొరకు ఆలపించే టువంటి సంస్థ తెలంగాణ ప్రజానాట్య మండలన్నారు. సిపిఐ యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కలేపల్లి మహేందర్, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజ హేమలత, బోధసు స్వామి నాతగాని కిష్టమ్మ, గడ్డం యాదమ్మ, అంజమ్మ అనురాధ, కన్నాయి మనోహర, చందన, వసంత లక్ష్మి పాల్గొన్నారు. మహాసభ గౌరవాధ్యక్షులుగా మీసాల దాసు, అధ్యక్షులుగా కన్నాయి మనోహర, ప్రధాన కార్యదర్శిగా నాటకాని కిష్టమ్మ, కోశాధికారిగా గడ్డం యాదమ్మ తోపాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## స్వర్ణ'గిరి ప్రదక్షిణం'



స్వర్ణగిరి క్షేత్రంలో శనివారం ఉదయం శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా కొండ కింద ఉన్న శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి గోవింద నామస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచి నీరు, మజ్జిగ అందించి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలో సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా సహస్ర నామార్చన సేవను నిర్వహించారు. శ్రీఅష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయమానంగా అర్చక స్వాములు చేశారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవ సేవ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారికి రథోత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

– ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతులు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం అవుతున్న సందర్భంగా మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతులు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. శనివారం ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సరిపడా హమాలీలను పెంచుకోవాలని వెంటనే షిఫ్ట్ ల వారిగా దిగుమతులు వెంటనే జరిగేలా చూడాలన్నారు. మిల్లర్ల అక్నాలెడ్జిమెంట్ పూర్తి చేయగలరని రైస్ మిల్లర్లకు ఆదేశించారు. ఎన్ఫోర్సమెంట్ స్టాఫ్ రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లకు పీపీసీ సెంటర్ లో అదనంగా లారీలు పెట్టమని ఆదేశాలిచ్చారు. ఈ సమావేశం లో డి సి ఎస్ ఓ, డి ఎం సి ఎస్, ఆర్టీవో, డిటిసిఎస్ లు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణా రావు



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాలు, విద్యా, డిఆర్డీఓ తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పౌర సరఫరాలు, విద్యా, డిఆర్డీఓ తదితర అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణా సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ సన్యాసయ, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు..

## హెడ్ కానిస్టేబుల్ కూతురు ఐఎఫ్ఎస్ కు ఎంపిక

తండ్రి, కూతురును సన్మానించిన ఎస్పీ నరసింహ



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయం నందు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ చల్లా యాదగిరి కూతురు యామిని ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ కు ఎంపికైనది. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నర్సింహ హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని, సివిల్ సర్వీసెస్ కు ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కూతురు యామిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖ నందు విధులు నిర్వర్తిస్తూ సిబ్బంది ఎలాంటి పని ఒత్తిడి ఉన్న కుటుంబాలకు సమయాన్ని కేటాయించి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తున్నారని ఎస్పీ అభినందించారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ కు ఎంపికైన యామిని ని పరీక్షలకు సన్నద్ధమైన విధానాన్ని, శిక్షణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని, మరిన్ని ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని కూతురు సమక్షంలో సన్మానించి మంచి లక్ష్యాన్ని సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచావని అభినందించారు. పోలీస్ సిబ్బంది వారి కుటుంబాలకు సమయాన్ని కేటాయించి పిల్లల చదువులు వారి లక్ష్యాలలో దిశా నిర్దేశం చేస్తూ ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ సంక్షేమ అర్ఎస్ఐ సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

## ఇంటర్మీడియట్ విద్య రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఇంటర్మీడియట్ వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విద్యా వ్యవస్థ వ్యతిరేక చర్య ప్రభుత్వం మీద తన నిర్ణయాన్ని పునసమీక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో అవైలబుల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన జరగగా ఆయన హాజరై మాట్లాడుతూ అశాస్త్రీయమైన సంస్కరణల పేరుతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టడం సరికాదన్నారు. ఉన్నత విద్యకు వారధిగా ఉన్న ఈ రెండేళ్ల విద్యా విధానాన్ని మార్చడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతారని ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల లేమి, అధ్యాపకుల కొరత వేధిస్తుంటే, వాటిని పరిష్కరించాల్సింది పోయి, ఏకంగా వ్యవస్థనే రద్దు చేయడం అంటే ప్రభుత్వ విద్యను అణిచివేయడమే అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇంటర్మీడియట్ వ్యవస్థ రద్దు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి, విద్యా రంగ నిపుణులు, విద్యార్థి సంఘాలతో చర్చించకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేసి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను వీడకపోతే, జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హిందురాణి, ధరావత్ జగన్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు నరేందర్, ప్రసన్న పాల్గొన్నారు.

## శ్రీకంఠ మహేశ్వర స్వామి సూరమాంబ విగ్రహావిష్కరణ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవ్యం శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాబ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణానికి రూ.లక్ష అందజేశారు. బీఆర్ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షులు, తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, చందుపట్ల సింగిల్ విండో మాజీ చైర్మన్ భల్లూరి మధుసూదన్ రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి నీల ఓంప్రకాశ్ గౌడ్, మాజీ ఎంపీపీలు సుబ్బురు బీరు మల్లయ్య, అతికం లక్ష్మినారాయణ గౌడ్, కేశపట్నం రమేష్, భువనగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు జక్కా రాఘవేందర్ రెడ్డి, సర్పంచ్ లు కంకల లలిత కిష్టయ్య, ర్యాకల సంతోష శ్రీనివాస్, కటిక జంగయ్య, గౌడ సంఘం అధ్యక్షులు అంతరి దానయ్య గౌడ్, పెద్ద గౌడ్, దంతూరి శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు నీల అశోక్ గౌడ్, దంతూరి సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్నం పాండు, పుట్ట వీరేష్ యాదవ్, సుబ్బురు రమేష్, జమ్ముల రమేష్, విశ్వజిత్ ఠాకూర్ సింగ్, దంతూరి నాగభూషణం గౌడ్, దంతూరి దామోదర్ గౌడ్, దంతూరి మురళీధర్ గౌడ్, సోలిపురం నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డికి నివాళి



**ముద్ర, తుంగతుర్తి:** తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ ,మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి 18వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా శనివారం తుంగతుర్తి లో బి ఎన్ స్థూపం వద్ద ఆయన అభిమానులు ఘనంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య మాట్లాడుతూ నిస్వార్థ త్యాగజీవి కామ్రేడ్ భీమిరెడ్డి అని కొనియాడారు.భూస్వాముల ,పెత్తందారుల, నిజాం రజాకారుల వెట్టిచాకిరి నుండి, ప్రజలకు విముక్తి కలిగించి లక్షలాది ఎకరాలభూమిని పేదలకు పంచిన ఎర్రజెండా ముద్దుబిడ్డ బి ఎన్ అన్నారు ఎస్సారెస్పీ రెండవ దశ కాలువ సాధించిన గొప్ప నాయకుడు భీమిరెడ్డి అన్నారు. వారి త్యాగాలను కృషిని భవిష్యత్ తరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరిమీద ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కోట రామస్వామి మాజీ ఎంపీటీసీ గుండగానీ దుర్గయ్య. ఉప్పల సోమయ్య. మహేందర్. రామకృష్ణ. దశరథ. పూసపెల్లి యాదగిరి. మట్టిపెల్లి లింగయ్య. వెలుగు నర్సయ్య. మనోజ్.. ఓరుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు



**ముద్ర, తుంగతుర్తి:** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందుతుందని రిపోర్టర్ ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీయూడబ్ల్యూజే ఐజేయు యూనియన్ జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు శంకరమంచి రవీందర్ శర్మ అన్నారు. శనివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో యూనియన్ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే ఐ జే యు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చలసాని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూజే అనేక ఉద్యమాలు చేసిందని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి యూనియన్ ఎంతో కృషి చేసిందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి కార్డులను అందజేయడానికి యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. రానున్న కాలంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఇంకా కృషి చేస్తుందని అన్నారు. మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు గా ఎన్నికైన రవీందర్ శర్మను ప్రెస్ మిత్రులు సన్మానించారు. యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాత్రికేయులు పూసపెల్లి యాదగిరి, వడ్లకొండ శ్రీనివాస్, తాళ్లపల్లి సోమన్న, ఆకారం ఎల్లయ్య, కోదాటి విక్రం రావు, ఓరుగంటి శ్రీనివాస్, ఎండి మజీద్, అండెం సైదులు లు పాల్గొన్నారు.

## ప్రధాని సభను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ



**ముద్ర, యాదగిరిగుట్ట:** పరేడ్ గ్రౌండ్ లో జరుగుతున్నటువంటి ప్రధాని మోడీ బహిరంగ సభ విజయవంతం చేయాలని యాదగిరిగుట్టలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలనే ఉద్దేశంతో మోడీ హైదరాబాదుకు వస్తున్నారని కులమత ప్రాంతం పార్టీ బేధం లేకుండా మోడీ సభకు హాజరుకావాలన్నారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, స్టేట్ కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం, పట్టణ మాజీ అధ్యక్షులు శ్యాంసుందర్, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ,మందోజు నరేష్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ మహేష్, కార్యదర్శిలు ఆవుల సత్యనారాయణ, దొమ్మట ప్రభాకర్ ,సీనియర్ నాయకులు బెలిదే అశోక్ ,శంకర్ ,నవీన్ ,బోడ సురేష్ ,బుచ్చిబాబు ,బండి మహేష్ ,ఆకుల దేవేందర్, రమేష్ , వంశీ, శ్రీనాథ్ అనిల్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 10.05.2026
www.mudranews.in | @mudranews



## మల్టీగ్రెయిన్ వాడకం



కేవలం గోధుమలే కాకుండా జొన్నలు, రాగులు, సజ్జలు వంటి తృణధాన్యాలను పిండిలో కలిపి వాడాలి. ఇవి గుండె ధమనులను శుభ్రంగా ఉంచే అవసరమైన పోషకాలను అందిస్తాయి.

# ఏసీ రూముల్లో కూర్చుంటే రైతుల కష్టాలు కనిపిస్తాయా...?

- పనిచేయలేకపోతే వెళ్లిపోండి
- చివరి గింజ వరకు కొనాలి
- ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్
- ధాన్యం కొనుగోలుపై సమీక్ష

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఏసీ రూముల్లో కూర్చుంటే రైతుల కష్టాలు కనిపిస్తాయా...? పనిచేయలేకపోతే వెళ్లిపోండని అధికారులపై ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్ నగేష్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ లీవ్ పెడితే ఇంచార్జీ ఎవరికిచ్చారని ప్రశ్నించారు. రైతులు ధాన్యం కొనాలని రోడెక్కుతున్నారు. వారి బాధ ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. కథలు చెప్పొద్దు.. రైతుల కష్టాలు తీర్చండంటూ అధికారులను ఆదేశించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా స్పందించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన వాహనాలు, హమాలీల కొరత, ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు తీర్చాలని ఆదేశించారు. రైస్ మిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యమవుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ మిల్ పాయింట్ల వద్ద గంటల కొద్దీ ట్రాక్టర్లు, లారీలు నిలిపేస్తున్నారు. రైతులు ఎండలో పడిగాపులు కాస్తున్నారు. ఇది ప్రభుత్వాన్ని చెడ్డపేరు తెచ్చే పని అన్నారు. హమాలీల కొరత కారణంగా అన్‌లోడింగ్ నెమ్మదిగా జరుగుతోందని అధికారులు చెప్పగా, అది మీ బాధ్యత కాదా? ముందే ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? అంటూ నిలదీశారు. సమావేశంలో కలెక్టర్ గైర్హాజరు అంశం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కలెక్టర్ సెలవులో ఉంటే ఇంచార్జీ అధికారి ఎవరు ప్రజల సమస్యలు చూసే వ్యవస్థ లేకుండా జిల్లా ఎలా నడుస్తుంది అని ప్రశ్నించారు. కలెక్టర్ ఫోన్ ఎత్తడం లేదు. ప్రజల సమస్యలు వినడానికి కూడా సమయం లేకుంటే ఎలా అన్నారు. ఓ రైతు పెట్రోల్ బాటిల్‌తో కార్యాలయానికి వచ్చిన ఘటనను ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రైతుల కోసం 24 గంటలు పనిచేస్తున్నారు. మంత్రులు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. అయినా గ్రౌండ్ లెవెల్‌లో సమస్యలు ఎందుకు తగ్గడం లేదన్నారు. మాకు రైతులే ముఖ్యం. ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. అందుకే ప్రజల తరఫున ముక్కుసూటిగా మాట్లాడుతున్నాం అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. చివరి గింజ వరకు కొనుగోలు జరగాలి. ట్రాన్స్‌పోర్ట్ విషయంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదన్నారు. ట్రాక్టర్ డీసీఎంలకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, సివిల్ సప్లై డిఎం జగదీశ్, నిత్యానంద్, డీఎస్పీ ప్రసన్న కుమార్, వ్యవసాయ, డీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు



### విద్య, వైద్యం, మహిళా సాధికారతకు
## ప్రభుత్వం ప్రాధాన్యం

- మంత్రి దామోదర్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా, వైద్య, మహిళా సాధికారత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గ్, రేగోడ్, టేక్మాల్, శంకరంపేట (ఆ) మండలాల అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లను ఎంపీ సురేష్ షెట్కర్ తో కలిసి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. అంగన్వాడీలను కాపాడుకునే గురుతర బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, ఏఎంసి చైర్ పర్సన్ కొప్పుల లక్ష్మీ శేషారెడ్డి, ఆర్డీఓ రమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, సీడీపీఓ పద్మలత, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న స్వీయ గణన

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



జనగణన–2027 విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశ అభివృద్ధి, ప్రణాళికలకు జనగణన అత్యంత కీలకమని తెలిపారు. ఈ నెల 10న అర్ధరాత్రి రాత్రి 12.00 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ముగియనున్నందున ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. 11 నుండి జనగణన ఇంటింటి సర్వే ఉంటుందని ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానమే సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వనరుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనగణన సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజలు సరైన వివరాలను నమోదు చేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## స్వీయ జనగణన నేటితో సమాప్తం

**మహదేవపూర్ ముద్ర:** 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు నేటి 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. https://se.census.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు ఈ వివరాలు పూర్తిగా గోప్యం గా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.



## చెరువులను పరిరక్షించుకోవాలి

- అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

చెరువులను పరిరక్షించుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ మండలం కోముటూరు చెరువు కట్టపై శనివారం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ, పూడిక తీత, ముళ్ల పొదల తొలగింపుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. చెరువు బాగుంటేనే ఊరు బాగుంటుందని, చెరువు ద్వారా పంటలు పండి గ్రామాలు ఆభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చెరువులను కాపాడుకొని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. చెరువులను అక్రమాల నుండి, కాలుష్యం నుండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, డీఈ శివ నాగరాజు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్ యాదగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ముక్త్ భారత్ బీజేపీ లక్ష్యం

- మోదీ సభ జయప్రదం చేయండి
- సీనియర్ నేత రావుల రాంనాథ్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ కోరారు. ఈ మేరకు మీడియా తో మాట్లాడుతూ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోదీ రాక సందర్భంగా నిర్మల్ జిల్లా నుండి బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ప్రధాని మోదీ సమరశంఖం పూరిస్తారన్నారు. తెలంగాణలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సైతం శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణకు "మోదీ వస్తున్నాడు భరోసా ఇస్తున్నాడు" అనే నినాదంతో చేపడుతున్న ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల బీజేపీ, పట్టణ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రజక న్యాయవాదుల అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో రజక న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రజక మెరిట్ విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో 584, 583, 562 మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఇంటర్‌లో 465, 461, 435 మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహించారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధ్యమేనని, విద్యార్థులు తమ తల్లిదండ్రులు , సమాజానికి గర్వకారణంగా నిలవాలని సూచించారు. చిన్న రాజ్ పందరి, భూంపల్లి శ్రీహరి, కోడూరు రాము, రమేష్, భాను ప్రసాద్, విద్యా ర్థులు, తల్లి దండ్రులు, పలువురు పాల్గొన్నారు

## శౌర్యానికి ప్రతీక రాణా ప్రతాప్



- మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మహారాణా ప్రతాప్ స్వాతంత్ర్యం, పరాక్రమానికి ప్రతీకగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి కొనియాడారు. పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన శ్రీ మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకల్లో అయన పాల్గొన్నారు. ఈ మేరకు మహా రాణాప్రతాప్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహారాణా ప్రతాప్ తన చివరి శ్వాస వరకు నిరంతరం, ధైర్యంగా పోరాడి శక్తివంతమైన మొఘలులకు లొంగిపోవడానికి పదేపదే నిరాకరించిన వీరుడన్నారు . ఆయన రాజపుత్రుల శౌర్యానికి మరియు పట్టుదలకు ప్రతీకగా నిలిచారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలకు గాను రాజస్థాన్‌లో ఒక వీరుడిగా కూడా గౌరవించబడ్డ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు కత్తి నరేందర్, నాందేడపు చిన్ను, గోపు గోపి తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అధికారుల కొరడా..



- రూ.10,200 జరిమానా

**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు కిరాణా దుకాణాలు, కూరగాయల షాపు లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.10,200 జరిమానాలు విధించారు. వ్యాపారులకు బట్ట సంచుల వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయని దుకాణదారులు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.వ్యాపార కార్యకలాపాల ద్వారా వెలువడే చెత్తను తడి, పొడి, హానికర వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై ఎస్‌డబ్ల్యూఎం–2019 చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు.తనిఖీలలో సానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, జవాన్లు విష్ణువర్ధన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## విద్యా వారోత్సవాలు విజయవంతం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఈ నెల 11 నుంచి 17 వరకు విద్యాశాఖ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక విద్యా వారోత్సవాలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జనగణన సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఫార్మర్ రిజిస్ట్రీ, తదితర అంశాలపై, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సి ఎస్ రామకృష్ణా రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ప్రణాళికకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల్లో పనుల శంకుస్థాపనలు, ఎస్ ఎస్ సి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థుల ఉత్తీర్ణత కోసం ప్రత్యేక విద్య శిబిరాల నిర్వహణ, వర్క్ షాప్ ల ఏర్పాటు, జయశంకర్ బడిబాట కార్యక్రమం, పోషకుల సమావేశాలు, విద్యా వేడుకల కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీసి లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి , డిఈఓ భోజన్న, వ్యవసాయ అధికారి అం జి ప్రసాద్, పౌర సరఫరాల అధికారి, మేనేజర్లు రాజేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited Printed at Colour Dot Graphics, Ali cafe X Road. Amberpet, Hyderabad-500013 Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound. Soma jiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy RNI No: TELTEL/2013/50413.email: mudradaily@gmail.com